క్లుప్తంగా

చంద్రబాబువి పగటి కలలు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో వచ్చే ఏడాది జరగనున్న శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పగటి కలలు కంటున్నారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అద్దాకుల చిన్నారావు ఎద్దేవా చేశారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మిచాంగ్ తుపాను బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన చంద్రబాబు రైతుల కష్టాలు తెలుసుకోకుండా.. వ్యక్తిగత గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 'దోషిని కాదు దొరనంటూ' చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తుపాను హెచ్చరికలపై రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని పూర్తిగా నివారించడం జరిగిందన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే వస్తుందన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు


పెసర పంట

పాలకొండ: రబీలో సాగు చేస్తున్న అపరాల సాగు ఆశాజనకంగా ఉంది. ఇటీవల మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో అపరాల పంటలకు అనుకూల వాతావరణం ఏర్పడింది. పెసర, మినుము మొక్కలు పెరిగి చేను పచ్చగా కనిపిస్తోంది. పంట చేతికొచ్చే వరకు వాతావరణం అనుకూలంగా ఉంటే ఆశించిన దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. కాగా, మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో రైతులు అపరాలు సాగు చేస్తున్నారు.

సత్యసాయి ప్రేమామృత ప్రసాదం పంపిణీ


భోజనాలు వడ్డిస్తున్న సేవా సమితి సభ్యులు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వైద్య పరీక్షల కోసం వచ్చిన వారికి ఆదివారం సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజనాలు పంపిణీ చేశారు. ప్రతీ నెల ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, గర్భిణులకు సత్యసాయి ప్రేమామృత ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ జగదీష్, ఆస్పత్రి సిబ్బంది, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు



పార్వతీపురం: కార్తీక మాసంలో దాదాపు అధిక శాతం శాకాహారాన్ని వినియోగించడంతో కూరగాయాలకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం పార్వతీపురంలోని నెహ్రూ మార్కెట్‌లో, రైతు బజార్‌లో టమాటో కిలో రూ.50, వంకాయలు రూ.50, బీరకాయలు రూ.60, చిక్కుడు కాయలు రూ.40, క్యాబేజీ పువ్వు రూ.20 నుంచి రూ.25 ధర పలుకుతున్నాయి. మండలంలోని వెంకంపేట, చినబొండపల్లి, పెదబొండపల్లి, సంగంవలస, పుట్టూరు, బాలగుడబ, నర్సిపురం తదితర గ్రామాలలో కూరగాయలను విరివిగా సాగు చేస్తున్నారు. అయితే ఆయాగ్రామాలలో కూరగాయల ధరలు కాస్త చౌకగా ఉండేవి. ప్రస్తుతం ఆయా గ్రామాలకు చెందిన రైతులు పార్వతీపురంలో అధిక ధరలు వస్తుండడంతో కూరగాయలను పార్వతీపురం మార్కెట్‌కు తీసుకు వెళ్లి విక్రయిస్తున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలు కారణంగాకూడా పంటలు దెబ్బతినడంతో ధరలు పెరిగాయని వినియోగదారులంటున్నారు. కూరగాయలు ధరలు పెరగడంతోపాటు విరివిగా లభించకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

జీవాల్లో కాలిపుండ్లతో జాగ్రత్త

- డిసెంబరు, జనవరి నెలల్లో వ్యాధి వ్యాప్తి
- వ్యాధి లక్షణాలపై పెంపకందారులకు అవగాహన తప్పనిసరి
- పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు


మేతకు వెళ్తున్న గొర్రెలు

గుమ్మలక్ష్మీపురం: గొర్రెలు, మేకలకు సోకే సీజనల్ వ్యాధులపట్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలలో జీవాలకు కాలిపుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంది. చిత్తడి నెలల్లో ఎక్కువగా తిరిగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గిట్టల పుండ్లు, బురద పుండ్లు, మితువకాళ్లు, పోడాళ్లు, తదితర పేర్లతో కూడా పిలుస్తారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే జీవాల ప్రాణాలకే ప్రమాదం. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై గుమ్మలక్ష్మీపురం పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు పలు సూచనలు చేశారు.

వ్యాధి లక్షణాలు..

కాలి గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి, చిట్లిపోయినట్లు ఉంటుంది. చీము పట్టి, నొప్పితో గొర్రెలు, మేకలు నడవలేక ముందు కాళ్లపై గెంతుతుంటాయి. వ్యాధి తీవ్రమైతే గిట్టలు ఊడిపోతాయి.

వ్యాధి నిర్ధారణ..

గిట్టల మధ్య చర్మం ఎర్రగా మరుతుంది. తర్వాత గిట్టల మధ్య వాపు వస్తుంది. పుండు పెద్దదై చీము పట్టి చెడు వాసన వస్తుంది. గిట్టలకు వ్యాధి సోకి కొన్ని సమయాల్లో గిట్టలు ఊడిపోతాయి.

వ్యాప్తి..

ఈ వ్యాధి స్పోరోఫోరస్ నోడొసిస్, ఫుసిబాక్టీరియం నెక్రోఫోరిస్ అనే బాక్టీరియా ద్వారా వస్తుంది. బురద నెలల్లో జీవాలు తిరిగినప్పుడు అందులోని బ్యాక్టీరియా బురదతో పాటు గిట్టల మధ్య చేరడంతో ఈ వ్యాధి సోకుంది. వ్యాధి సోకిన గొర్రెల గిట్టలు ఇతర గొర్రెలకు తాకడం వల్ల, వ్యాధి సోకిన జీవాలు ఉండే ప్రదేశాలలో వేరొక గొర్రెల మందలు తిరుగటం వల్ల వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

నివారణ..

జీవాల్ని చిత్తడి నెలల్లో ఎక్కువ సేపు తిరగనివ్వరాదు. పొడిగా ఉండే ప్రదేశాల్లో మేపాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. సిమెంట్ ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి అందులోకి 8 శాతం పోటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా 5 శాతం ఫార్మలిన్ ద్రావణం పోసి అందులో నుంచి జీవాల్ని ప్రతి రోజు 3–5 నిమిషాలు నడిపించాలి. అలాగే వ్యాధి సోకిన గొర్రెలు, మేకలు ఉండే మంద నుంచి జీవాలను కొనుగోలు చేయరాదు. వ్యాధి సోకిన వాటిని వేరే ప్రదేశాలకు లారీలు, ట్రాక్టర్లలో గాని రవాణా చేయరాదు.

చికిత్స..

వ్యాధి సోకిన కాళ్లను 10 శాతం జింక్ సల్ఫేట్ లేదా 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో 5 నిమిషాలు ముంచాలి. తర్వాత లోరాక్సెన్ అనే యాంటీబయాటిక్ ఇంజెక్షన్లు, వరుసగా 3–5 రోజులు వేయించాలి. కాళ్ల నొప్పులు తగ్గడానికి జోబిడ్ ఇంజెక్షన్లు వరుసగా 3–5 రోజులు వేయించాలి.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం


పెద్దూరులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: భారత ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి చెప్పారు. సీతంపేట, పెద్దూరు గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత సంకల్ప యాత్రను ఆమె ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఉజ్వల, పీఎంఏవై, పీఎంజేఏవై, గరీబ్ కళ్యాన్ అన్నయోజన, దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన తదితర పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, ఎ.కళావతి, ఈఓపీఆర్డీ సత్యం, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి


బొమ్మట్రైన్‌లో చిన్నారుల షికారు


సైక్లింగ్ చేస్తున్న యువతులు

సీతంపేట: కార్తీకమాసం ఆఖరి ఆదివారం కావడంతో ఏజెన్సీలోని పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో కళకళలాడాయి. సీతంపేట అడ్వంచర్ పార్కుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. అక్కడి జలవిహార్‌లో బోటు షికారు చేశారు. వివిధ సాహస క్రీడల్లో పాల్గొని సందడి చేశారు. సమీపంలోని మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు.

రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్: భారత రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించారని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకని ఆదివారం కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ హక్కులను కాపాడుకుంటూ సమాజ శ్రేయస్సులో భాగస్వామ్యం కావాలన్నారు. విద్యార్థులు తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదని సూచించారు. రాజ్యాంగం ద్వారా వ్యక్తి స్వేచ్ఛకు, జీవించేందుకు కల్పించిన హక్కులను వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సోఫియా సొధామిని, వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, పి.రాజ్యలక్ష్మి, రాఘవేంద్రనాయుడు, కుమారి, ప్రశాంతి, సౌమిత్‌రాజ్ తదితరులున్నారు.

పీహెచ్‌సీలో ఉచితనేత్ర వైద్యశిబిరం


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ ఎస్వీ రమణ

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అంధత్వ నివారణకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని, కంటి వ్యాధిగ్రస్తులు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ (సీహెచ్‌ఓ) ఆఫీసర్ ఎస్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో శంకర్‌ఫౌండేషన్ నేత్రవైద్యులతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించిన సమయంలో వివిధ కారణాల వల్ల హాజరుకాని, శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినా ఇంతవరకూ ఆస్పత్రులకు హాజరుకాని వారికోసం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యులు 60 మందికి కంటిపరీక్షలు నిర్వహించి నలుగురికి శస్త్రచికిత్స అవసరమైనప్పటికీ వారికి మధుమేహం ఉన్నందున వ్యాధి తగ్గేందుకు మందులు అందజేసినట్లు చెప్పారు. త్వరలో వారికి శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. ప్రస్తుతం 28 మందికి శస్త్రచికిత్స చేయడానికి బస్సులో విజయనగరం తరలించామన్నారు. మరో 28 మందికి కంటిఅద్దాలు, చుక్కల మందులు అవసరమని గుర్తించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు, శంకర్‌ఫౌండేషన్ కోఆర్డినేటర్, పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నూర్పిడిలు


ఏబీ రోడ్డు పక్కన ఆరబోసిన ధాన్యం

భామిని: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు కోత కోసిన వరిపంట తడిచి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలువురు రైతులు వరిపంట కోతలు వాయిదా వేసుకున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావం పూర్తిగా తొలగిపోవడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు వరికోతలు ముమ్మరంగా చేపడుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తిచేసిన వారు యంత్రాలతో నూర్పిడులు ధాన్యాన్ని సేకరిస్తున్నారు. తేమ శాతం అధికంగా ఉండడంతో వాటిని ఎండలో ఆరబెట్టి బస్తాల్లో నిల్వ చేస్తున్నారు.

కురుపాంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'


రావాడ జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, వైస్సార్‌సీపీ శ్రేణులు

కురుపాం: మండల కేంద్రం కురుపాంలో సచివాలయం-1 వద్ద ఆదివారం ఎంపీపీ శెట్టి పద్మావతి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు కావాలో వివరించారు. సచివాలయ వద్ద సంక్షేమ పథకాల డ్యాష్ బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన రామ నామస్మరణ


ర్యాలీ నిర్వహిస్తున్న హిందు ధర్మ ప్రచారకర్తలు

పాలకొండ: సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం హిందూ ధర్మ ప్రచార యాత్ర నిర్వహించారు. వందలాది మంది రామభక్తులు పూర్ణకలశాలతో ఈ యాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని ఆచరించాలని, ధర్మ రక్షణకు కృషిచేయాలని కోరారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. హిందు ధర్మ ప్రచార కర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు


ధాన్యం కొనుగోలుపై ఏఓ సౌజన్యతో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు

వీరఘట్టం: దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల పేరిట రైతులను ఇబ్బందులు పెట్టొద్దని, వర్షాలకు తడిచి రంగుమారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు. గతేడాది ధాన్యం కొనుగోలు కోసం నియమించిన టీఏలు, డీఈఓలు చేతివాటం చూపించి రైతులను ఇబ్బందులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఏడాది ఎటువంటి తప్పులు జరగకుండా రైతుల నుంచి ధాన్యం సేకరించాలన్నారు. అనంతరం ఏఓ జే సౌజన్య మాట్లాడుతూ.. రైతుల తమ వద్ద ధాన్యం ఉన్నాయని సమీపంలోని ఆర్‌బీకేకు సమాచారం ఇచ్చినట్లయితే ఆర్‌బీకే సిబ్బంది కళ్లాలకు వెళ్లి ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించి తూకం వేస్తారని, ధాన్యం తరలింపునకు ప్రభుత్వమే లారీలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రస్తుతానికి మండల వ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీరఘట్టం రెల్లివీధిలో విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, గత సమావేశంలో చెప్పినా ఎందుకు వాటిని సరిచేయలేదని ఎంపీపీ దమలపాటి విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను సరిచేయాలని సూచించారు. అనంతర ఎంపీడీఓ వై.వెంకటరమణ మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి నిర్వహించే 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను విజయవంతం చేయాలని కోరారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు యువత ముందుకు రావాలని కోరారు. సంత-నర్సిపురంలో జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ కర్రి గోవిందరావు అధికారులను కోరారు. సమావేశంలో జెట్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీలు పత్రి విజయకుమారి, విశ్వాసరాయి భార్గవ్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: ఉద్యోగుల్లో స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేందుకు క్రీడలు సహకరిస్తాయని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని చిన్నమంగళాపురం వద్ద సచివాలయ ఉద్యోగుల మధ్య క్రికెట్ పోటీలను ఆదివారం ఆమె ప్రారంభించారు. మండలం, పట్టణ పరిధిలో 31 సచివాలయాల నుంచి 10 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సై బి.శివప్రసాద్, జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు నూతలపాటి భరత్‌భూషణ్ రాజు, తదితరులు మాట్లాడుతూ.. ఉద్యోగుల మధ్య ఇటువంటి పోటీల నిర్వహణతో పని ఒత్తిడిని అధిగమించడంతో పాటు వారి మధ్య సఖ్యత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్, ఎంపీడీఓ డొంక త్రినాథులు, ఉపాధ్యాయులు జి.శ్రీవాసరావు తదితరలు బ్యాటింగ్, బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. ఉత్సాహంగా సాగిన ఈ పోటీల్లో రాయల్ స్ట్రైకర్స్, బ్లాక్ పాంథర్స్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


గిరిజనలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కృష్ణమూర్తి

కొమరాడ: మండలంలోని పాలేం పంచాయతీ రావికోన గ్రామంలో 40మంది వృద్దులకు పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ విధులు నిర్వహిస్తున్న వృద్ధమిత్ర హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి ఆదివారం దుప్పట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికి వృద్దులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. పేదలకు సాయం చేయడంతో సంతృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ వారి సంపాదనలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాలకొండ: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహించనున్న జిల్లా సమగ్ర అభివృద్ధి సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆ పార్టీ మండల కమిటీ నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకుడు డి.రమణారావు మాట్లాడుతూ.. జంపరకోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలని, రైతు బజార్ నిర్మాణం చేపట్టాలని, పాలకొండ డివిజన్ కేంద్రంలో వ్యవసాయ సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'ఎన్నాళ్లీ వెనుకబాటు' కార్యక్రమం ద్వారా రైతు సమస్యలపై సీపీఎం చేస్తున్న పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ.లక్ష్మణరావు, ఎస్.నారాయణరావు, కె.రాము, డి.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


గరుగుబిల్లి: సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు


భామిని: యాగంలో పాల్గొన్న

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు బాబాకు నిత్య పూజా కార్యక్రమాలతో పాటు అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు ఏవీఎస్ఎస్ ఆచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈ హోమంలో పాల్గొనడం వల్ల ఈతిబాధలు తొలగడంతో పాటు మనసులో కోరిన కోర్కెలు నెరవేరుతాయని అర్చకులు తెలిపారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు.

ముగిసిన సుబ్రహ్మణ్య యాగం

భామిని: ఘనసరలోని శ్రీమధన కామేశ్వరాలయం ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహించిన సుబ్రహ్మణ్య స్వామి యాగం ఆదివారం ముగిసింది. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు యాగంలో పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు

పట్టణంపై మంచుదుప్పటి


ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దట్టంగా కురుస్తున్న పొగమంచు


వెంకటరాయుని కోనేరు పరిసరాల్లో కమ్ముకున్న పొగమంచు

పాలకొండ రూరల్: ప్రస్తుత శీతాకాలంలో వేకువజామున కురుస్తున్న మంచు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది. ఆదివారం తెల్లవారు జామున పాలకొండ పట్టణాన్ని మంచుదుప్పట్లు కమ్ముకోవటంతో నిత్యం చూసే ప్రాంతాల్లో సరికొత్త అందాలు దర్శనమిచ్చాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు, వెంకటరాయుని కోనేరు, శ్రీకాకుళం రహదారిలో మంచు దట్టంగా కురవడంతో పాదచారులు, వాహనచోదకులు కొంత ఇబ్బందులు పడ్డారు. పొగమంచు ప్రభావంతో శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వాహనచోదకులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

భామిని: తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదివారం ఉదయం భామినిలో దట్టంగా పొగమంచు కురిసింది. ఉదయం 8 గంటలైనా వాహనదారులకు రోడ్డు సరిగా కనిపించకపోవడంతో లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. చలితీవ్రత ఒక్కసారిగా పెరగంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.